# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 28-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- వికసిత్ భారత్ లక్ష్య సాధనకు స్వయం సమృద్ధి సాధించడం తప్పనిసరని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- వామపక్ష తీవ్రవాదాన్ని వచ్చే ఏడాది మార్చి 31 నాటికి పూర్తిగా నిర్మూలించనున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు.
- భారత్ అనుసరిస్తున్న స్వతంత్ర విదేశాంగ విధానాన్ని, జాతీయ ప్రయోజనాలను పూర్తిగా గౌరవిస్తామని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్‌రోవ్ పేర్కొన్నారు.
- ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి అంతర్జాతీయ సహకారం అత్యవసరం అని భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ తెలిపారు.

====================

వికసిత్ భారత్ లక్ష్య సాధనకు స్వయం సమృద్ధి సాధించడం తప్పనిసరని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆకాశవాణి ద్వారా మన్ కీ బాత్.. మనసులోని మాట కార్యక్రమం 126వ సంచికలో ప్రధానమంత్రి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రజలు దేశంలో తయారైన వస్తువులను మాత్రమే కొనుగోలు చేస్తామని సంకల్పం తీసుకోవాలని కోరారు. అలా చేయడం ద్వారా చేతివృత్తి కళాకారుల కష్టానికి గౌరవం దక్కుతుందని, యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. ఛఠ్ మహాపర్వం ఇప్పుడు ప్రపంచవ్యాప్త పండుగగా మారుతోందని, ఈ పండుగను యునెస్కో సాంస్కృతిక వారసత్వ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని నరేంద్ర మోదీ తెలిపారు. గతంలో ప్రభుత్వం చేసిన కృషి ఫలితంగానే కోల్‌కతా దుర్గా పూజ కూడా యునెస్కో జాబితాలో చేరిందని ప్రధానమంత్రి గుర్తు చేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

స్వాతంత్ర్య సమర యోధుడు భగత్ సింగ్, ప్రముఖ గాయని లతా మంగేష్కర్‌ల జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వారికి శ్రద్ధాంజలి ఘటించారు. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ ఉరికంబం ఎక్కారని, తమ ప్రాణాలను

ఉరి ద్వారా కాకుండా, తుపాకీ గుండుతో నేరుగా తీసేయాలని భగత్ సింగ్ కోరుకున్నారని తెలిపారు. ఇది ఆయనకు ఉన్న అసాధారణ ధైర్యానికి నిదర్శనం అని నరేంద్ర మోదీ కొనియాడారు. ప్రముఖ గాయని లతా మంగేష్కర్ పాడిన దేశభక్తి గీతాలు ప్రజలపై ప్రభావాన్ని చూపాయన్నారు. భారతీయ సంస్కృతి, సంగీతంపై ఆసక్తి ఉన్న ఎవరైనా ఆమె పాటలను విని మంత్రముగ్ధులైపోతారని పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

====================

వామపక్ష తీవ్రవాదాన్ని వచ్చే ఏడాది మార్చి 31 నాటికి పూర్తిగా నిర్మూలించనున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 'నక్సల్ ముక్త్ భారత్' ముగింపు సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు, దేశంలో మూడు ప్రధాన అంతర్గత భద్రతా సమస్యలు ఉండేవని అమిత్ షా గుర్తు చేశారు. జమ్మూ కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు, వామపక్ష తీవ్రవాద కారిడార్ లో హింసాత్మక ఘటనలు జాతీయ భద్రతను తీవ్రంగా ప్రభావితం చేసేవని ఆయన తెలిపారు. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రభుత్వం దీర్ఘకాలిక వ్యూహాన్ని అమలు చేసిందని పేర్కొన్నారు.

====================

భారత్‌కు పొరుగునే ప్రపంచ ఉగ్రవాదానికి కేంద్ర బిందువు అయిన దేశం ఉందని, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ భారతదేశం ఉగ్రవాద సవాలును ఎదుర్కొంటోందని భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం 80వ సెషన్ సాధారణ చర్చలో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దశాబ్దాలుగా జరిగిన అనేక అంతర్జాతీయ ఉగ్రదాడుల మూలాలు ఆ ఒక్క దేశంలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి అంతర్జాతీయ సహకారం అత్యవసరం అని ఈ సందర్భంగా ఉద్ఘాటించారు.

====================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. "సేవా పర్వ్" పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా యూపిఐపై ఒక ప్రత్యేక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 85 సెకన్లు)

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న స్వతంత్ర విదేశాంగ విధానాన్ని, జాతీయ ప్రయోజనాలను రష్యా పూర్తిగా గౌరవిస్తుందని ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లవ్ రోవ్ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్-అమెరికా లేదా ఇతర దేశాలతో సంబంధాలు ఢిల్లీ-మాస్కో మైత్రికి కొలమానం కాబోవని లవ్ రోవ్ పేర్కొన్నారు. భారతదేశం, రష్యా మధ్య "వ్యూహాత్మక భాగస్వామ్యం" ఉందని తెలిపారు.

====================

'ప్రపంచ ఆహార సదస్సు 2025' న్యూఢిల్లీలో ఈరోజు ముగిసింది. ఈ సదస్సు ద్వారా లక్ష కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు రావడం విశేషం. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో 26 ప్రముఖ కంపెనీలు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందాల ద్వారా 64 వేల మందికి పైగా ప్రజలకు ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందని,

మరో 10 లక్షల మందికి పైగా పరోక్ష ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన `జీఎస్టీ బచత్ ఉత్సవ్` ఈ నెల 22న ప్రారంభమైంది. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు దీని ద్వారా ప్రయోజనం కలుగుతోంది. కేంద్ర ప్రభుత్వం శిశు సంరక్షణ ఉత్పత్తులపై జీఎస్‌టీని తగ్గించడం ద్వారా సామాన్య ప్రజలపై భారాన్ని తగ్గించేందుకు కీలక చర్యలు తీసుకుంది. భావితరం జీఎస్‌టీ సంస్కరణలలో భాగంగా, బేబీ ఫీడింగ్ బాటిళ్లు, నాప్‌కిన్‌లు వంటి అనేక ముఖ్యమైన శిశు సంరక్షణ ఉత్పత్తులపై పన్ను రేటును 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. అదేవిధంగా, చిన్నారుల ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం అల్ట్రా-హై టెంపరేచర్ పాలపై పన్నులను పూర్తిగా మినహాయించింది.

====================

త్వరలో జరగబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు, వివిధ రాష్ట్రాల్లోని 8 శాసనసభ నియోజకవర్గాల ఉప ఎన్నికల కోసం కేంద్ర పరిశీలకులను నియమించినట్లు భారత ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించడానికి మొత్తం 470 మంది అధికారులను కేంద్ర పరిశీలకులుగా నియమించింది. వీరిలో 320 మంది IAS, 60 మంది IPS అధికారులు ఉన్నారు.

====================

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నూతన అధ్యక్షుడిగా ఢిల్లీ మాజీ కెప్టెన్ మిథున్ మన్హాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముంబైలో ఈరోజు జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశం (AGM)లో ఆయనను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

====================

ఆసియా కప్ టీ-20 ఫైనల్‌లో భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య దుబాయ్ వేదికగా క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ 5 ఓవర్లు పూర్తయ్యే సరికి వికెట్ నష్టపోకుండా 37 పరుగులు చేసింది.

====================

====================